



EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4PM

www.suryaa.com

మంగళవారం

18-11-2025

పేజీలు: 02




## నా భార్య, నా అత్త వల్లే ఈరోజు నేను ఇలా అవ్వడానికి కారణం

**- ఐ బొమ్మ రవి**


పోలీస్ విచారణలో ఐ బొమ్మ రవి భావోద్వేగంతో కూడిన సంచలన విషయాలు వెల్లడి. విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీలో ఒక మామూలు డిగ్రీ పట్టా పొంద. జీవితంలో చాలా ఓడిదుడుకులు చూసా. వెబ్ డిజైనర్ గా నా కెరీర్ మొదలు పెట్టా. తల్లి తండ్రులు విడిపోయారు. మా నాన్న ఒక చిన్న బ్యాంకు ఉద్యోగి. గత ఏడాదే నా చెల్లి పెళ్లి చేశా. నా జీవితంలో ప్రేమించి పెళ్లిచేసుకోవటం వాళ్ల నాకు భయం, బాధ్యత మరింత పెరిగింది. నా ప్రేమ పెళ్లికి సహకరించిన వల్లే నన్ను ఎందుకు పనికి రావు అని సమాజంలో అందరి ముందు అవహేళన చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. నా భార్య, అత్త సమాజం మాటలను నమ్మేవారు. సమాజం మాటలు అయినా విని వదిలేసే వాణ్ణి కానీ నా భార్య అత్త మాటలు సహించలేక పోయా. వెబ్ డిజైనర్ గా మొదట్లో నాకు జీతం చాలా తక్కువ వచ్చేది అది నాకు నా కుటుంబానికి సరిపోయేది. కానీ నా భార్య అత్తగారికి అవసరానికి డబ్బులు ఇవ్వలేక పోయాను. వాళ్ల బాధ ఒత్తిడి చూడలేక నా వెబ్ డిజైన్ అనుభవంతో నేను ఐ బొమ్మ వెబ్ సైట్ ను ప్రారంభించాను ఐ బొమ్మ ద్వారా సినిమా ప్రింట్లను అందులో పోస్ట్ చేసేవాడిని. 2021 రెండో కోవిడ్ సమయంలో లో నా ఐ బొమ్మ వెబ్సైట్ కు విపరీతమైన ఆదరణ వచ్చింది. ఒక సమయంలో నా మొదటి సంపాదన బెట్టింగ్ యాప్స్, లోన్ యాప్స్ ద్వారా నేను సంపాదించిన డబ్బు అక్షరాల 75 లక్షలు. ఆరోజు నా ఆనందానికి అవధుల్లేవు. ఇంటికి వెళ్లి నా భార్య అత్తకు నేను సాధించిన ఘనత ఆధారాలతో చూపిస్తే కూడా నన్ను నమ్మలేదు. నా భార్య వారి అమ్మ మనసులో నన్ను వదిలించుకోవాలి అని ఉంది అర్థం అయింది. నేను ఈ దారిని ఎంచుకోవడానికి ముఖ్య కారణం నా భార్య, అత్తే. ఎన్నో సార్లు నన్ను ఏడిపించారు. సమాజంలో నా మీద చాలా అసభ్యంగా ప్రవర్తించారు. ఇవ్వని నా సంపాదన లేకపోవడం అనుకున్న కానీ తరువత తెలిసింది వల్ల దారిలో నేను లేకపోవడం వల్ల అని. ఆరోజు నేను నిర్ణయించుకున్న డబ్బు ఎంత ముఖ్యమో అని. ఈరోజు నేను మీకు దొరికిపోవడానికి కారణం కూడా వల్లే అని నాకు తెలుసు అంటూ సమాధానం చెప్పినట్టు సమాచారం.



## పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ మరో షెడ్యూల్ విడుదల

తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల అంశంపై ఎమ్మెల్యేలపై విచారణలు కొనసాగుతున్నాయి. తాజాగా, ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణకు సంబంధించి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మరో షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 19, 20 తేదీల్లో మిగిలిన నలుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించనున్నారు. ఈ నెల 19న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, 20న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీలు న్యాయవాదుల క్రాస్ ఎగ్జామినేషన్‌ను ఎదుర్కోనున్నారు.

## వరకట్నం వేధింపులు.. 7 నెలల గర్భిణి ఆత్మహత్య



కరీంనగర్ జిల్లా ఇల్లందకుంటకు చెందిన మౌనిక అనే ఏడు నెలల గర్భిణీ, అదనపు కట్నం కోసం అత్త, మామ, భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంది. భూపాలపల్లి జిల్లాకు చెందిన భర్త ప్రశాంత్, అత్త సులోచన, మామ సంపత్‌లే తమ కూతురి మృతికి కారణమని మౌనిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, వారిపై కేసు నమోదైంది. తన కుమార్తె చావుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లి డిమాండ్ చేస్తోంది.


# మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ.. హిడ్మా సహా ఆరుగురు మృతి



అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది. మావోయిస్టులు, భద్రత బలగాల మధ్య జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో పలువురు అగ్రనేతలు మృతి చెందినట్లు సమాచారం. ఇప్పటికీ రెండు వర్గాల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయని పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. మారేడుమిల్లి ప్రాంతంలో పోలీసులు-మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి ఏడు గంటల మధ్య ఎదురు కాల్పులు మొదలయ్యాయి. ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఫైర్ లో ఆరుగురు మావోయిస్టుల మృతి చెందారని పోలీసులు తెలిపారు. వారిలో మావోయిస్టు అగ్రనేత హిడ్మా ఉన్నట్లు తెలుస్తోంది. మారేడుమిల్లి ప్రాంతంలోని లోతట్టు అటవీ ప్రాంతాల్లో మావోయిస్ట్ అగ్ర నేతలు తల దాచుకున్నారనే విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు స్థానిక పోలీసులు, భద్రతా బలగాలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని కూబింగ్ చేపట్టారు. ఇంతలో ఎదురు కాల్పులు మొదలయ్యాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్ అగ్రనేత హిడ్మా, అతని భార్య సహా ఆరుగురు మావోయిస్టులు మరణించినట్టు సమాచారం. అయితే అధికారికంగా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. టైగర్ జోన్‌లో ఉదయం 6-7 గంట మధ్య ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. ఎన్‌కౌంటర్‌లో మరణించిన హిడ్మాపై రూ. కోటి, ఆయన భార్యపై రూ.50 లక్షల రివార్డ్ ఉంది. మావోయిస్టు పార్టీలో గెరిల్లా దాడులకు వ్యూహకర్తగా హిడ్మాకు మంచి పేరు ఉంది. ఆపరేషన్ కగార్ తీవ్రతరం అవడంతో చత్తీస్‌గఢ్ నుంచి మారేడుమిల్లి వైపు హిడ్మా టీమ్ వచ్చినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు భద్రతా దళాలు భారీ ఎత్తున కూంబింగ్ చేపట్టారు. సుక్మా జిల్లా పూవర్తికి చెందిన హిడ్మా, మావోయస్ట్ కార్యకలాపాల్లో క్రియాశీలంగా వ్యవహరించారు. విలాస్, హిడ్మాల్, సంతోష్ అనే పేర్లతోనూ తిరిగిన హిడ్మా వయసు 50 ఏళ్లు పైనే..! హిడ్మాకు హిందీ, గోండి, తెలుగు, కోయ, బెంగాలీ భాషలపై మంచి పట్టు ఉంది. దండకారణ్యంలో మావోయిస్టు కమిటీల్లో కీలకంగా మారిన హిడ్మా, 2017లో 25మంది సీఆర్పీఎఫ్ జవాన్ల మృతికి కారణమయ్యారు. గెరిల్లా వార్‌ఫేర్ స్కిల్స్‌లో హిడ్మాది తిరుగులేని టాలెంట్.

### హిడ్మా అలియాస్ సంతోశ్..

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూనర్తి గ్రామంలో హిడ్మా జన్మించారు. ఆయన అలసు పేరు మాద్వి హిడ్మా అలియాస్ సంతోశ్. 25 ఏండ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లారు. బస్తర్, దంతేవాడ ప్రాంత దళంలో కీలక సభ్యుడిగా ఎదిగారు. చిన్న వయస్సులోనే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడిగా అయ్యారు. గెరిల్లా దాడులకు వ్యూహకర్తగా పేరొందిన హిడ్మా.. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (PLGA) ప్లాటూన్-1 కమాండర్‌గా పనిచేశారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగానూ చేశారు. ఆయన మల్లా, నిషాద్ వర్గాలకు చెందిన వందలాది మందిని మావోయిస్టు పార్టీలో చేర్పించారు. వారికి సాయుధ శిక్షణ ఇచ్చి పీఎల్‌జీఏలో చేర్చి.. అభేద్యమైన సైన్యంగా తీర్చిదిద్దారు. గతంలో హిడ్మా నాయకత్వంలోనే భద్రతా బలగాలపై అనేక దాడులు జరిగాయని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్న హిడ్మా.. చాలా సార్లు పోలీసులకు దొరికినట్టే దొరికి తప్పించుకున్నారు. అగ్రనేతలు సోనూ, ఆశన్నతోపాటు వందల మంది మావోయిస్టులు లొంగిపోయిన తర్వాత హిడ్మా లొంగుబాటు విషయంలో పెద్ద చర్చ జరుగుతున్నది. అనారోగ్య కారణాలతో ఆయన లొంగిపోనున్నట్లు వార్తలు కూడా వచ్చాయి. ఆయన కుమార్తె వంజెం కేషా అలియాస్ జిన్నీ ఈ ఏడాది ఫిబ్రవరిలో వరంగల్ పోలీసుల ఎదుట లొంగిపోయారు.



## ఆత్మాహుతి దాడిని సమర్థించిన డాక్టర్ ఉమర్ నబీ.. వెలుగులోకి సంచలన వీడియో

ఢిల్లీ పేలుడు కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. తాజాగా ఎర్రకోట వద్ద ఆత్మాహుతి దాడికి పాల్పడిన డాక్టర్ ఉమర్ నబీకి చెందిన సంచలన వీడియో బయటకు వచ్చింది. పేలుడుకు ముందు అతడు సూసైడ్ బాంబింగ్ గురించి మాట్లాడాడు. అందులో అతడు ఆత్మాహుతి దాడిని సమర్థిస్తూ మాట్లాడాడు. సూసైడ్ బాంబింగ్ గురించి అందరూ తప్పుగా అర్థం చేసుకుంటారని.. వాస్తవానికి అదొక బలిదాన ఆపరేషన్‌గా అతడు అభివర్ణించారు. 'ఆత్మాహుతి బాంబు దాడికి వ్యతిరేకంగా అనేక వాదనలు ఉన్నాయి. మరణంపై ఉన్న సహజ అంచనాలకు వ్యతిరేకంగా ఓ వ్యక్తి నిర్దిష్ట సమయంలో, నిర్దిష్ట ప్రదేశంలో కచ్చితంగా చనిపోతాడని భావించడాన్ని బలిదాన ఆపరేషన్ అంటారు' అంటూ ఉమర్ ఆ వీడియోలో వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఈ వీడియో సంచలనం రేపుతోంది. కాగా, దేశంలో భారీ పేలుళ్లకు కుట్ర పన్నినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు సోదాలు చేపట్టగా.. ఫరీదాబాద్‌లో వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ బయటపడింది. వైద్యుల మాటున పలువురు ఉగ్రకార్యకలాపాలు సాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్న సమయంలోనే ఈ నెల 10వ తేదీన దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుడు సంభవించింది. ఎర్రకోట సమీపంలోని మెట్రో స్టేషన్ వద్ద కారులో పేలుడు చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇప్పటి వరకూ 15 మంది మరణించారు. ఇక ఈ పేలుడుకు పాల్పడింది ఓ వైద్యుడిగా అధికారులు గుర్తించారు. ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ వైద్యుడు ఉమర్ నబీగా గుర్తించారు. ఈ మేరకు అతడితో సంబంధం ఉన్న వ్యక్తులను దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ విచారణలో ఉమర్ ఓ కరుడుగట్టిన ఉగ్రవాది అని తేలింది.

## హసీనాకు మరణశిక్షతో మరోసారి భగ్గుమన్న బంగ్లాదేశ్

**తాజా అల్లర్లలో ఇద్దరు మృతి**

పొరుగుదేశం బంగ్లాదేశ్‌లో మరోసారి అల్లర్లు చెలరేగాయి. ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనాకు బంగ్లా ప్రత్యేక ట్రిబ్యునల్ మరణశిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఈ తీర్పుతో బంగ్లాలో అల్లర్లు చెలరేగాయి. కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా హసీనా మద్దతుదారులు, అవామీ లీగ్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. వారి ఆందోళనలతో బంగ్లాలో మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ అవామీలీగ్ పార్టీ రెండు రోజులపాటూ దేశవ్యాప్తంగా బంద్ ప్రకటించింది. దీంతో యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం అప్రమత్తమైంది. ఢాకా సహా ఇతర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసింది. భారీగా పోలీసులు మోహరించారు. మరోవైపు



నిరసనకారులు ఢాకాలోని అనేక రహదారులను దిగ్బంధించారు. అప్రమత్తమైన పోలీసులు నిరసనకారులను చెదరగొట్టేందుకు లాఠీ ఛార్జ్ చేశారు. సౌండ్ గ్రెనేడ్‌లను, టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. తాజా అల్లర్లలో ఇద్దరు వ్యక్తులు మరణించారు. కాగా, మానవత్వానికి వ్యతిరేకంగా క్రూర నేరాలకు పాల్పడ్డారనే కారణంతో బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరణశిక్ష విధిస్తున్నట్లు ఆ దేశ ప్రత్యేక ట్రిబ్యునల్ సోమవారం తీర్పు ప్రకటించింది.



## కృతి శెట్టి కోలీవుడ్ ఎంట్రీ ఆలస్యం!

ఉప్పెనతో టాలీవుడ్ లో అడుగుపెట్టి, మొదటి మూడు చిత్రాలతో హిట్ అందుకున్న కన్నడ నటి కృతి శెట్టి, ఆ తర్వాత వరుస ఫ్లాపులతో ఇబ్బంది పడుతోంది. తెలుగులో సక్సెస్ దక్కకపోవడంతో మాలీవుడ్ లో ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ ఏడాది కోలీవుడ్ లోకి అడుగుపెట్టాలని భావించినా, ఆమె నటించిన సినిమాలు విడుదల ఆలస్యం అవుతున్నాయి. కార్తీతో నటించిన 'వా వాతియార్' సినిమా షూటింగ్ వాయిదా పడుతూ వస్తోంది. అలాగే 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమా కూడా డిసెంబర్ 18కి వాయిదా పడింది.


## ఈ సమస్యను నేను పరిష్కరిస్తా.. కుటుంబంలో విభేదాలపై లాలూ యాదవ్



బీహార్ ఎన్నికల ఫలితాల అనంతరం ఆర్జేడీ అధినేత లాలూ యాదవ్ కుటుంబంలో విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్న విషయం తెలిసిందే. ఫలితాలు వెలువడిన తర్వాత లాలూ కుమార్తె రోహిణి ఆచార్య రాజకీయాలకు గుడ్‌బై చెప్పేశారు. అంతేకాదు, తన కుటుంబంతో తెగదెంపులు చేసుకుంటున్నట్లు సోషల్ మీడియా ద్వారా సంచలన ప్రకటన చేశారు. 'తేజస్వీ సన్నిహితులు సంజయ్, రమీజ్ నాతో బలవంతంగా ఇది చేయిస్తున్నారు. అన్ని తప్పలకు నన్ను బాధ్యులను చేయిస్తున్నా'రని ఆరోపించారు. రోహిణి ఆరోపణలు ఆర్జేడీలో ప్రకంపనలు సృష్టించాయి. ఈ నేపథ్యంలో కుటుంబంలో చీలికలపై లాలూ యాదవ్ తొలిసారి స్పందించారు. ఇది కుటుంబ అంతర్గత విషయమని.. తాను పరిష్కరిస్తానంటూ వ్యాఖ్యానించారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో లాలూ యాదవ్ సమావేశం నిర్వహించారు. పాట్నాలో జరిగిన సమావేశానికి లాలూ యాదవ్ భార్య రబ్రీ దేవి, పెద్ద కుమార్తె మిసా భారతి, జగదానంద్ సింగ్ సహా సీనియర్ ఆర్జేడీ నాయకులు హాజరయ్యారు. ఇక ఈ సమావేశంలో ఆర్జేడీ ఎల్పీ లీడర్‌గా తేజస్వీ యాదవ్‌ను ఎన్నుకున్నారు. ఈ మీటింగ్ సందర్భంగా ఫ్యామిలీలో విభేదాల గురించి లాలూ ప్రస్తావించారు. 'ఇది కుటుంబ అంతర్గత విషయం. కుటుంబంలోనే పరిష్కరించాలి. ఈ సమస్యను నేను పరిష్కరిస్తా' అని వ్యాఖ్యానించారు. కాగా, ఇటీవలే జరిగిన బీహార్ ఎన్నికల్లో ఆర్జేడీ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్ కూటమి ఘోర పరాభవం పాలైన విషయం తెలిసిందే.

# ఉరి తీర్పులు.. పడిపోయిన నాయకుల దురంతం!





బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు దేశంలోని తాత్కాలిక ప్రభుత్వం నిన్న (నవంబర్ 17, 2025) మరణశిక్ష విధించింది. గత ఏడాది విద్యార్థుల నిరసనలను దారుణంగా అణచివేసినందుకు ఆమెపై మానవత్వానికి వ్యతిరేక నేరాల కేసు నమోదైంది. ఈ తీర్పు ఆమె లేకుండానే (ఇన్ యాబ్సెంటియా) వెలువడటం విశేషం. ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందిన హసీనా ఈ తీర్పును రాజకీయ కుట్రగా తోసిపుచ్చారు. ఈ సంఘటన రాజకీయ అస్థిరతలో అధికారం కోల్పోయిన నాయకులు ఎదుర్కొనే కఠిన శిక్షలను మరోసారి గుర్తుచేస్తోంది. చరిత్రలో ఇలాంటి ఉదాహరణలు అరుదైనవి కావు. పాకిస్తాన్ మాజీ ప్రధాని జుల్ఫికర్ అలీ భుట్టో 1979లో రాజకీయ కుట్ర కేసులో మరణశిక్షకు గురై ఉరితీయబడ్డారు. అదేవిధంగా టర్కీ మాజీ ప్రధాని అద్నాన్ మెండెరెస్ 1960 సైనిక తిరుగుబాటు తర్వాత ఉరిశిక్ష అనుభవించారు. ఇరాక్ ఏకాధిపతి సద్దాం హుస్సేన్‌ను 2006లో అమెరికా దాడి తర్వాత ఏర్పడిన ప్రభుత్వం మరణశిక్ష విధించి అమలు చేసింది. ఈ ఘటనలు అధికారం శాశ్వతం కాదని, పతనం తర్వాత న్యాయం కఠినంగా వస్తుందని నిరూపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో మాత్రం మరణశిక్షలు తప్పించుకున్న ఉదాహరణలు కూడా ఉన్నాయి. దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు చున్ డూ-హ్వాన్‌కు అవినీతి, తిరుగుబాటు ఆరోపణలపై మొదట మరణశిక్ష విధించారు కానీ తర్వాత దాన్ని యావజ్జీవ కారాగార శిక్షగా మార్చారు. అదేవిధంగా పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషార్రఫ్‌కు రాజద్రోహం కేసులో మరణశిక్ష పడినా, ఆ తీర్పును తర్వాత రద్దు చేశారు. ఈ రాయితీలు రాజకీయ పరిణామాలు, అంతర్జాతీయ ఒత్తిళ్లపై ఆధారపడి వచ్చాయి. షేక్ హసీనా కేసు బంగ్లాదేశ్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించనుంది. ముహమ్మద్ యూనుస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఈ తీర్పును 'చారిత్రకం'గా అభివర్ణించింది. ఇప్పుడు భారత్ నుంచి ఆమెను ఎక్స్‌ట్రాడిషన్ చేయించే ప్రయత్నాలు ముమ్మరం కానున్నాయి. ఈ సంఘటన దక్షిణాసియా రాజకీయాలను కుదిపేస్తుందనడంలో సందేహం లేదు. అధికారం ఉన్నప్పుడు చేసిన తప్పిదాలు ఎప్పటికైనా వెంటాడతాయనే సందేశం ఇది ఇస్తోంది.

# హైడ్రా ప్రజావాణికి 52 ఫిర్యాదులు



నగరంలో ఎలా అనువుగా ఉంటే అలా కబ్జాలకు పాల్పడుతున్నారు. డెడ్ ఎండ్ కాలనీ అయితే.. ఆ మర్గాన్ని కబ్జా చేసేయడం, పాత లే ఔట్‌లలో హద్దులు చెరిపేసి పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల ఆక్రమణ.. ఇలా అనేక ఫిర్యాదులు నగరం నలుమూలల నుంచి హైడ్రాకు అందుతున్నాయి. ఆఖరుకు ఆలయాలకు ఉద్దేశించిన స్థలాలు, పుణ్య స్నానాలు ఆచరించడానికి ఉద్దేశించిన కోనేరును కూడా కబ్జా చేసేస్తున్నారంటూ జగద్గిరిగుట్టలోని శ్రీ గోవిందరాజు స్వామి దేవస్థానం ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. కూకట్‌పల్లి ఎల్లమ్మబండ వద్ద ఉన్న ఎల్లమ్మకుంటలోకి ప్రగతినగర్ మురుగంతా వచ్చి చేరుతోందని కాలువ మళ్లింపు పనులు త్వరగా జరిగేలా చూడడంతో పాటు.. కుంట ఆక్రమణలను కూడా తొలగించాలని అక్కడి నివాసితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. శంషాబాద్ విలేజ్, ఆర్ ఆర్ నగర్ అయ్యప్ప కాలనీలోని సర్వే నంబరు 748, 749లో పార్కుతో పాటు.. ప్రజావసరాలకు కేటాయించిన 4794 గజాల స్థలం కబ్జాకు గురైందని అక్కడి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఇలా నగరం నలుమూలల నుంచి సోమవారం ప్రజావాణికి మొత్తం 52 ఫిర్యాదులు అందాయి. వీటిని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు పరిశీలించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక అందజేయాలని ఆదేశించారు.




# అర్జున్‌కు డ్రా


చెస్ ప్రపంచకప్‌లో భారత ఆశలు మోస్తున్న తెలంగాణ గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసి.. క్వార్టర్స్‌లో చైనా ప్లేయర్ వీయి తో జరిగిన తొలి గేమ్‌ను సులువైన డ్రా చేసుకున్నాడు. సోమవారం జరిగిన క్వార్టర్స్ పోరును నల్లపావులతో ఆడిన అర్జున్.. 31 ఎత్తుల తర్వాత గేమ్‌ను డ్రాగా ముగించాడు. 206 మంది బరిలోకి దిగిన ఈ టోర్నీలో క్వార్టర్స్ మొదలయ్యేసరికి 8 మంది మిగలగా వీరిలో టాప్-3లో నిలిచివారు వచ్చే ఏడాది ఫిడే క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు అర్హత సాధిస్తారు. మరి అర్జున్ ఆ జాబితాలో ఉంటాడా? లేదా? అన్నది మరికొన్ని గంటల్లో తేలనుంది. ఉజ్బెకిస్థాన్ గ్రాండ్ మాస్టర్ నొడిర్‌బెక్.. 1-0తోజర్మన్ ఆటగాడు అలగ్జాండర్ డొంచెంకోను ఓడించి క్వార్టర్స్ పోటీల్లో తొలి విజయాన్ని నమోదుచేశాడు.



# జిగిల్‌మనేలా నేహా అందాలు

తెలుగు కుర్రాళ్ల గుండెల్లో రాధికగా నిలిచిపోయింది నేహా శెట్టి. డీజే టిల్లు సినిమాతో ఒక్కసారిగా సెన్సేషన్ అయిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత మాత్రం అంతగా అవకాశాలు అందుకోలేదు. గ్లామర్ బ్యూటీగా వెండితెరపై సంచలనం సృష్టించిన ఈ అమ్మడు.. ఇప్పుడు సినిమాలతోపాటు.. ఇటు సోషల్ మీడియాలోనూ సైలెంట్ అయ్యింది. తాజాగా ఈ వయ్యారి లేటేస్ట్ ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. మంగుళూరుకు చెందిన నేహా శెట్టి.. చిన్న వయసులోనే మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత 2014లో మిస్ మంగుళూరుగా కిరీటాన్ని దక్కించుకున్నారు. ఆ తర్వాత 2015లో మిస్ సౌతిండియా పోటీల్లో రన్నరప్ గా నిలిచింది.

# ఏపీ 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 16 లేదా 21 నుంచి స్టార్ట్!



ఆంధ్రప్రదేశ్‌లో 2026 ఏడాది 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను మార్చి 16వ తేదీ లేదా 21వ తేదీ నుంచి ప్రారంభించేందుకు విద్యాశాఖ దృష్టి సారించింది. ఈ రెండు తేదీలకు అనుగుణంగా రెండు వేర్వేరు టైమ్‌టేబుళ్లను సిద్ధం చేసి ఇప్పటికే ప్రభుత్వానికి సమర్పించారు. త్వరలోనే ఈ రెండింటిలో ఒక షెడ్యూల్‌కు అధికారిక ఆమోదం లభించనుంది. ఈ నిర్ణయం వల్ల విద్యార్థులు ముందుగానే తమ తయారీని ప్లాన్ చేసుకోవచ్చు. ఈ సారి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6.50 లక్షల మంది విద్యార్థులు ఎస్ఎస్‌సీ పరీక్షలకు హాజరుకానున్నారు. వీరందరికీ సౌకర్యవంతంగా పరీక్షలు నిర్వహించేందుకు దాదాపు 3,500 కొత్త పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. గత ఏడాదితో పోల్చితే కేంద్రాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇది పరీక్షా వ్యవస్థను మరింత సాఫీగా నిర్వహించేందుకు దోహదపడనుంది. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణ కోసం ప్రత్యేక దృష్టి పెడుతున్న విద్యాశాఖ 35 వేల మంది ఇన్విజిలేటర్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బందిని ఎంపిక చేయడం ప్రారంభించింది. ఈ భారీ బృందం మాల్‌ప్రాక్టీస్‌లను అరికట్టి, నిష్పక్షపాతంగా పరీక్షలు జరిగేలా చూస్తుంది. అన్ని జిల్లాల నుంచి అర్హత ఉన్న ఉపాధ్యాయులను ఈ బాధ్యతలకు నియమించే ప్రక్రియ వేగంగా జరుగుతోంది. మొత్తం మీద ఏపీలో ఎస్ఎస్‌సీ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. త్వరలోనే అధికారిక టైమ్‌టేబుల్ విడుదల కానుండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది మరింత క్రమబద్ధంగా, నాణ్యతతో పరీక్షలు పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది.




# విద్యార్థుల కోసం BSNL ప్రత్యేక ప్లాన్


విద్యార్థులు, మహిళల కోసం బీఎస్ఎన్ఎల్ (BSNL) కొత్త ప్లాన్‌లను త్వరలో ప్రవేశపెట్టనుంది. బాలల దినోత్సవం సందర్భంగా ఇప్పటికే విద్యార్థుల కోసం 'స్టూడెంట్ స్పెషల్ ప్లాన్'ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. ఈ ప్లాన్ రోజుకు కేవలం రూ. 8.96 (రూ.251/28 రోజులు) వ్యయంతో అపరిమిత వాయిస్ కాలింగ్, 100GB హై-స్పీడ్ డేటా, రోజుకు 100 SMSలను అందిస్తుంది. ఈ ప్లాన్‌ను నవంబర్ 14 నుంచి డిసెంబర్ 13, 2025 వరకు యాక్టివేట్ చేసుకోవచ్చు.

# విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ ఉచిత ఆఫర్

కళాశాల, విశ్వవిద్యాలయ విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ శుభవార్త అందించింది. విద్యార్థులు తమ విద్యా సంబంధిత ఇమెయిల్ ఐడీని ఉపయోగించి Microsoft 365 Personal ప్యాకేజీని ఒక సంవత్సరం పాటు పూర్తిగా ఉచితంగా పొందవచ్చు. ఈ ఆఫర్ ద్వారా విద్యార్థులు ఎటువంటి సబ్‌స్క్రిప్షన్ ఫీజు చెల్లించకుండా ప్రీమియం యాప్‌లు, అధునాతన Copilot ఫీచర్లకు యాక్సెస్ పొందవచ్చు. వర్డ్, ఎక్సెల్, పవర్ పాయింట్, టీమ్స్ వంటి యాప్‌లతో పాటు 1TB క్లౌడ్ స్టోరేజ్ కూడా లభిస్తుంది.




# వికటించిన ఐవీఎఫ్.. కవలలు, భార్య మృతి.. తట్టుకోలేక భర్త ఆత్మహత్య




సంతానానికి ఐవీఎఫ్ చికిత్స తీసుకుని, కవల పిల్లల కోసం ఆనందంగా ఎదురుచూస్తున్న ఆ దంపతుల జీవితం, కొద్ది గంటల్లోనే విషాదాంతమైంది. కడుపులోనే కవలలు కన్నుమూయడంతో ఆ షాక్‌కు తట్టుకోలేక నిండు గర్భిణి అయిన భార్య కూడా తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది. అయితే ప్రేమగా చూసుకున్న భార్య, కలలుగన్న కవలలు కనుమరుగు కావడంతో ముత్యాల విజయ్ గుండె పగిలిపోయింది. శోకసంద్రంలో మునిగిన ఆ భర్త--- తన జీవితం ఇక శూన్యమని భావించి, శంషాబాద్‌లోని తమ ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడిన హృదయ విదారక ఘటన ఆ ప్రాంతాన్ని కన్నీటిలో ముంచేసింది.

# దారుణ ప్రమాదం.. బైక్ ఢీకొన్నాకే లారీ కాలుపైకి ఎక్కింది.. వ్యక్తికి తీవ్ర గాయాలు!



సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం బస్టాండ్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో పలు కిలోమీటర్ల దూరం నుంచి వస్తున్న లారీ ఆగకుండా పోవడంతో మరింత దారుణం జరిగింది. ఢీ కొన్న బైక్ నుంచి రోడ్డుపై పడిపోయిన యువకుడి కాలు మీదుగా ఆ లారీ దూసుకెళ్లింది. క్షణాల్లో రక్తపు మడుగు పరచిన రోడ్డు దృశ్యం చూసిన స్థానికులు గుండెలు అదురుదాఖా షాక్‌కు గురయ్యారు. ప్రమాదానికి గురైన వ్యక్తి చిల్పకుంట్ల గ్రామానికి చెందిన గుణగంటి పరమేష్. అతను తన బైక్‌పై వేగంగా వెళుతుండగా ఎదురుగా వచ్చిన మరో బైక్‌తో తలపడటంతో నియంత్రణ కోల్పోయి రోడ్డు మీద పడిపోయాడు. ఆ సమయంలోనే వేగంగా వస్తున్న లారీ అదే మార్గంలో అతని కుడి కాలుపై దూసుకుపోయింది. తీవ్ర రక్తస్రావంతో పరమేష్ అక్కడే నొప్పులతో కిందపడి ఉన్నాడు. సంఘటన జరిగిన వెంటనే స్థానికులు, బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి సహాయం అందించారు. గాయపడిన పరమేష్‌ను తక్షణమే సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. డాక్టర్లు అతని పరిస్థితిని క్షుణ్ణంగా పరీక్షిస్తున్నారు. ఈ ప్రమాదం గురించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రెండు బైకులు అతివేగంతో వస్తుండటమే దుర్ఘటనకు ప్రధాన కారణమని అంచనా వేస్తున్నారు. నూతనకల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రోడ్డు భద్రతపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తిన ఈ ఘటన పట్ల అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

# లారీని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు.. తప్పిన ప్రాణ నష్టం



మరో ట్రావెల్స్ బస్సు రోడ్డు ప్రమాదానికి గురైంది. జాతీయ రహదారిపై లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా అదుపు తప్పిన బస్సు దానిని ఢీకొట్టింది. దీంతో ఎనిమిది మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ వద్ద జరిగింది. కే. కావేరీ ట్రావెల్స్‌కు చెందిన స్లీపర్ బస్సు హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్నది. ఈ క్రమంలో నందిగామ వద్ద జాతీయ రహదారిపై లారీని ఓవర్ టేక్ చేస్తుండగా బస్సుపై డ్రైవర్ అదుపు కోల్పోయాడు. దీంతో అది లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం ధాటికి బస్సు ఎడమ వైపు నుజ్జునుజ్జు అయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని దవాఖానకు తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారని చెప్పారు. కాగా, ప్రాణాపాయం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.